
# దేవుడు



బడి గంట గణ గణ మంటూ మోగింది.

పిల్లలు గోల చేస్తూ హోలోమని నవ్వులతో, కేరింతలతో బడి నుంచి బయటపడ్డారు. హడావుడిగా, ఆనందంగా, గుంపులు గుంపులుగా రోడ్డుమీద నడుస్తున్నారు. కొందరు పిల్లలు తమ కోసం ఏర్పాటైన రిక్షాల్లోనూ, మరికొందరు, తల్లిదండ్రుల సైకిళ్ళమీదా, స్కూటర్లపైనా వెళ్ళిపోతున్నారు.

సాయంత్రం నాలుగున్నరైంది. ఆకాశం మబ్బు మబ్బుగా ఉంది. సన్నగా చినుకులు పడుతున్నాయి. చినుకులు తమపైన చిరుజల్లుగా పడుతుంటే తుళ్ళిపడుతున్నట్టుగా పిల్లలు పరుగు తీస్తున్నారు.

వంశీ తన పుస్తకాల సంచీతో నెమ్మదిగా నడుస్తున్నాడు. తల వంచుకుని అడుగులో అడుగు వేస్తున్నాడు.

రోడ్డు నిండా నల్లటి చీమలు బారులు బారులుగా పాకుతున్నాయి. ఇన్ని చీమలు ఎక్కడ్నుంచి వచ్చాయో ? వంశీ కళ్ళు ఇంతగా ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

పిల్లలందరూ చీమల్ని తమ కాళ్ళతో తొక్కుతూ కంగారుగా ముందుకు పోతున్నారు. చీమలు పిల్లల కాళ్ళ కింద నలిగిపోతున్నాయి. గిల గిల కొట్టుకుంటూ అక్కడిక్కడే ప్రాణాలు విడుస్తున్నాయి.

వంశీ తన కాళ్ళ కింద ఏ ఒక్క చీమా పడకుండా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నాడు గిలగిల కొట్టుకుంటున్న చీమల్ని చూస్తే వంశీకి జాలిగా ఉంది. బాధగా ఉంది. ఆ రోజు ఉదయం బడిలో మాస్టారు చెప్పిన పాఠం గుర్తుకు వచ్చింది.

జీవహింస మహా పాపం అంటే సృష్టిలో ఏ జీవిని మనం బాధపెట్టకూడదు. అలా బాధపెడితే దేవుడికి కోపం వస్తుంది. దేవుడు మనల్ని శిక్షిస్తాడు అని మాస్టారు చెప్పారు. మాస్టారు దేవుడి గురించి పదేపదే చెబుతూంటారు. ఆ దేవుడు ఎలా ఉంటాడో, ఎక్కడ ఉంటాడో అన్న సందేహం వంశీలో చాలా రోజులుగా మెదులుతోంది.

"మాస్టారూ ! దేవుడెక్కడ ఉంటాడు ?" వంశీ ఆసక్తిగా ఆ రోజు బడిలో అడిగాడు.

"దేవుడు మనకు కనిపించడు. ఆకాశంలో ఉంటాడు. నువ్వు కూర్చో." మాస్టారు జవాబు చెప్పారు.

"ఆకాశంలోకి మనం వెళ్ళొచ్చు కదండీ ?" వంశీ మళ్ళీ అడిగాడు.

"వెళ్ళొచ్చురా ! నువ్వు పెద్దవాడివయ్యాక వెళ్దువుగానిలే." మాస్టారు చిరాకు పడ్డారు.

ఆరేళ్ళ వంశీకి అన్నీ అనుమానాలే. సందేహాలే. చురుకుదనం, తెలివితేటలు వంశీకి చిన్నపటి నుంచీ అలవడ్డాయి. వంశీ అడిగిన ప్రశ్నలకు వాళ్ళమ్మ కూడా సరిగ్గా జవాబు చెప్పదు. బడిలో మాస్టారు కూడా విసుక్కుంటారు. వంశీకి దేవుడు ఎలా ఉంటాడో చూడాలని ఉంది. దేవుడితో మాట్లాడాలని ఉంది. ఎలాగైనా ఆకాశం మీదకు వెళ్ళాలి. దేవుడిని చూడాలి - వంశీ గట్టిగా నిశ్చయించుకున్నాడు.

ఆకాశం మీదకు వెళ్ళాలంటే ఎలా ? వంశీ రోడ్డు మీద ఆలోచిస్తూ నడుస్తున్నాడు.

... ... ...

వంశీ ఇంటికి వెళ్ళాడు. అమ్మ పెట్టిన ఫలహారం ఆవురావురు మంటూ తిన్నాడు. గ్లాసెడు పాలు గడగడా తాగాడు. బట్టలు మార్చుకున్నాడు. "అమ్మా ! నేను కాస్సేపు ఆడుకుని వస్తాను."

వంశీ వీధిలోకి వచ్చాడు. వీధిలో కొంత దూరం నడిచి ఒక సందులోకి తిరిగాడు. ముందుకు వెళ్ళి అక్కడ పెంకుటింటి ముందు నిలబడి "సురేష్! ఒరేయ్ సురేష్" అంటూ గొంతెత్తి పిలిచాడు. వంశీ పిలుపుకు సురేష్ ఇంట్లోంచి బాణంలా బయటకు వచ్చాడు.

"నడవరా వెళ్దాం !" సురేష్, వంశీ భుజం మీద చేయి వేశాడు. ఇద్దరూ వీధిలో నడుస్తున్నారు. దారిలో వాళ్ళ స్నేహితుడు రామం కలిశాడు. ముగ్గురూ కబుర్లు చెప్పుకుంటూ నడవసాగారు. ఆ వీధి చివర పంచాయతీ ఆఫీసు ముందు ఆటల మైదానం ఉంది. అక్కడ పిల్లలందరూ కలిసి ఆడుకుంటారు. ముగ్గురు మిత్రులూ ఆటల మైదానంలోకి వచ్చేసరికి అక్కడ సందడిగా, గోలగా ఉంది. పైన ఆకాశంలోంచి వర్షపు తుంపర పడుతోంది. పిల్లలు ఎగిరి గంతులు వేస్తున్నారు. "పైన ఆకాశంలోంచి దేవుడే వర్షం కురిపిస్తున్నాడు కాబోలు" వంశీ ఆకాశంలోకి చూస్తూ అనుకున్నాడు.

సురేష్, వంశీ రామం కబాడీ జట్టులో కలిశారు. అరగంట సేపు అలుపు లేకుండా ఆడుకున్నారు. ఇంటికి వెళ్ళిపోదామను కుంటూ ఉండగా పంచాయతీ ఆఫీసు వెనుక వీధిలోకి పరుగెత్తారు. అక్కడి దృశ్యం చూసి పిల్లలు బొమ్మల్లా నిలబడిపోయారు. అక్కడ ఏం జరిగిందో వాళ్ళెవరికీ అర్థం కాలేదు. అది సూర్యం ఇల్లు...

సూర్యం కూడా తమ బళ్ళోనే చదువు తున్నాడు. సూర్యం ఇంటి ముందు అయిదారుగురు ఆడవాళ్ళు గొల్లుమంటూ ఏడుస్తున్నారు. వాళ్ళ మధ్య సూర్యం తాత పడుకుని నిద్రపోతున్నాడు. ఆ చుట్టుపక్కల వాళ్ళందరూ నిలబడి కళ్ళు ఒత్తుకుంటున్నారు. కొంతసేపటికి, తాతని పాడుగాటి కర్రల మీద పడుకోబెట్టి నలుగురు

మనుషులు మోసుకుని ఎక్కడికో తీసుకుపోయారు. అక్కడ నిలబడ్డ పిల్లల్ని చూసి ఒక పెద్దాయన అవతలకు పొమ్మని కసిరాడు. పిల్లలంతా చెల్లాచెదురైపోయి ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు.

వంశీ నెమ్మదిగా పెద్దవాళ్ళని తప్పించుకుని సూర్యం ఇంటి ముందుకొచ్చాడు. వంశీని ఎవరూ పట్టించుకోలేదు. వంశీ ఒక మూలగా కూర్చున సూర్యం దగ్గరగా వచ్చాడు. సూర్యం కూడా వెక్కి వెక్కి పడుతూ ఏడుస్తున్నాడు.

'సూర్యం ! ఎందుకేడుస్తున్నావురా నువ్వు ?' వంశీ అడిగాడు.

"మా తాత దేవుడి దగ్గరకు వెళ్ళిపోయాడుగా? అందుకని..." సూర్యం ఏడుస్తూనే జవాబు చెప్పాడు.

"దేవుడి దగ్గరకు ఎందుకు వెళ్ళిపోయాడు మీ తాత ?" వంశీ సందేహంగా అడిగాడు.

"తాతకు జబ్బు చేసింది కదా ! జబ్బు చేసిన వాళ్ళందరూ దేవుడి దగ్గరకు వెళ్ళిపోతారంట... అమ్మ చెప్పింది" సూర్యం తనకు తెలిసిన విషయం చెప్పాడు.

తనకూ జబ్బు చేస్తే తొందరగా దేవుడి దగ్గరకు వెళ్లొచ్చు కదూ ?

వంశీ దేవుడి గురించి ఆలోచిస్తూ ఇంటిముఖం పట్టాడు !

... ... ...

రాత్రి తొమ్మిది గంటలయ్యింది.

వంశీ వాళ్ళమ్మ పక్కలో పడుకున్నాడు. వంశీకి నిద్రరావటం లేదు. టేబులు మీద అలారం గడియారం టిక్ టిక్‌మంటూ శబ్దం చేస్తోంది. వంశీ తండ్రి కృష్ణమూర్తి ముందు గదిలో ఏదో పుస్తకం దీక్షగా చదువుకుంటున్నాడు.

"అమ్మా ! దేవుడు ఆకాశంలో ఉంటాడట కదా !" వంశీ అడిగాడు.

"అవున్రా ! ఎవరు చెప్పారు నీకు ?" వంశీ తల్లి సావిత్రి జోకొడుతూనే జవాబు చెప్పింది.

"మా మాస్టారు చెప్పారమ్మా. అమ్మా, అమ్మా! నేను దేవుణ్ణి చూస్తానమ్మా ! ఆకాశంలోకి వెళ్ళి...

"అలాగే బాబూ ! నిద్రపో. నువ్వు పెద్దవాడివయిన తరువాత ఆకాశంలోకి వెళ్ళి దేవుడ్ని చూద్దువుగానిలే."

'అమ్మా ! దేవుడు మన ఊళ్ళోకి రాడామ్మా?'

"రాడు బాబు ఆకాశంలోనే ఉంటాడు."

"అమ్మా జబ్బు చేస్తే తొందరగా దేవుడు దగ్గరకు వెళ్ళొచ్చునట కదా !"

"ఛీ ! నోర్మూయ్యి వెధవా ! మాట్లాడకుండా పడుకో !"

సావిత్రి వంశీ వీపు మీద చిన్నగా చరిచి కోప్పడింది.

వంశీకిమ్మనకుండా పడుకున్నాడు. వంశీకి తల్లి మీద కోపం వచ్చింది. అమ్మ ఎప్పుడూ ఇంతే. ఏది అడిగి పూర్తిగా సమాధానం చెప్పదు. నాన్న కూడా అంతే విసుక్కుంటాడు. తిడతాడు. కొడతాడు.

అదే సుందరం బాబాయి అయితే తనను దగ్గరకు తీసుకుని మంచి మంచి కథలూ, కబుర్లూ చెబుతాడు. బాబాయి కబుర్లకి అంతూదరీ ఉండదు. బాబాయికి ఉద్యోగం లేదు. భుజానికి పొడవాటి సంచీ ఒకటి తగిలించుకుని, గెడ్డం పెంచుకుని ఊర్లన్నీ తిరుగుతాడు. నెల కోసారి తమ ఊరు వస్తాడు. ఈ సారి బాబాయి తమ ఇంటికి వచ్చినప్పుడు మరిచిపోకుండా అడగాలి. దేవుడు ఆకాశంలో ఉంటాడట కదా ! ఆ దేవుడి దగ్గరకు ఎలా వెళ్ళాలి ? దేవుడెలా ఉంటాడు. దేవుడితో మనం మాట్లాడవచ్చా ? జబ్బు చేస్తే దేవుడి దగ్గరకు వెళ్ళిపోతారట కదా ! అలా ఎందుకు వెళ్ళిపోతారు.

... ... ...

"ఒరేయ్ వంశీ ! ఇలా వచ్చి దేవుడికి దణ్ణం పెట్టుకో !"

తల్లి కేకతో హోం వర్క్ చేసుకుంటున్న వంశీ చటుక్కున మధ్య గదిలోకి వెళ్ళాడు. వంశీ తల్లి సావిత్రి తలార స్నానం చేసి ముడి వేసుకుంది. నుదుట కుంకుమ బొట్టు పెట్టుకుంది. గదిలో ఒక

మూలగా ఉన్న పటాలకు హారతి ఇస్తూ, మరో చేత్తో చిన్ని గంట, గణ గణా మోగించింది !

"ఒరేయ్ ! రెండు చేతులూ జోడించి దణ్ణం పెట్టుకో"

వంశీ తల్లి చెప్పినట్టే రెండు చేతులు జోడించి కళ్ళు మూసుకున్నాడు. "అమ్మా దేవుడు ఏడీ ? ఎక్కడున్నాడు ?" వంశీ కళ్ళు తెరుస్తూ అడిగాడు.

"అడుగోరా ! ఆ పటంలో ఉన్నాడు కదా ఆయనే దేవుడు." తల్లి అరటిపండు వలిచి చిన్న ముక్క వంశీకి పెట్టింది.

'అమ్మా ! దేవుడు ఆకాశంలో ఉంటాడని చెప్పావు కదా ! ఈ బొమ్మని చూపిస్తున్నావేమిటి ?'

వంశీ ప్రశ్నతో సావిత్రికి మళ్ళీ చిరాకు వచ్చింది.

'నీకు చెప్పలేక చస్తున్నారా ! దేవుడు ఆకాశంలోనూ ఉంటాడు, మన ఇంట్లోనూ ఉంటాడు. నీకిప్పుడు అర్థం కాదులే, వెళ్ళి చదువుకో.'

వంశీ ఆ పటంలో దేవుడిని పరీక్షగా చూశాడు.

దేవుడు ఇలా ఉంటాడా ? ఈయనేనా దేవుడు? దేవుడు ఆకాశంలోనూ, ఇంటోన్లూ ఉంటాడా ? ఆయన అరటిపళ్ళు తింటాడా ? వంశీ అనుమానంగా కొద్ది నిమిషాలు అక్కడే నిలబడి చూశాడు.

"దేవుడా ! అరటిపళ్ళు తిను" అంటూ పలకరించాడు.

దేవుడు మాట్లాడలేదు. అరటిపళ్ళూ తినలేదు.

వంశీ నిరాశగా తన గదిలోకి వచ్చాడు. దేవుడు ఆకాశంలోనూ, ఇంట్లోనూ కూడా ఎలా ఉంటాడు? అమ్మ అబద్ధం చెప్పిందా ?

వంశీ బుర్ర ఆలోచనలతో గజిబిజిగా తయారైంది.

... ... ...

ఆ పూట వంశీ బడిలోంచి ఇంటికి వచ్చేసరికి ఇల్లంతా సందడిగా ఉంది. తల్లి సావిత్రి తండ్రి కృష్ణమూర్తి హడావుడిగా తిరుగుతున్నారు. చుట్టుపక్కల ఇళ్ళలోని ఆడవాళ్ళు, పిల్లలు తమ ఇంటి వరండాలో గుమికూడి వింతగా చూస్తున్నారు.

వంశీ వాళ్ళను తప్పించుకుని వీధి గదిలోకి అడుగుపెట్టాడు. వంశీకి ఒక్క క్షణం భయం వేసినట్టయింది.

వీధి గదిలో బవిరి గెడ్డం పెంచుకున్న ఓ తాత బాసిపటం వేసుకుని కూర్చున్నాడు. ఆ తాత ఒంటి మీద కాషాయ గుడ్డలున్నాయి. భుజానికి జోలె ఉంది. నుదుట విభూతి బొట్టు, మెడలో రుద్రాక్షమాల ఉన్నాయి...

"వంశీ ! లోపలికి రారా ! ఈయన నిత్యానందస్వామి. ఎక్కడో ఆశ్రమం నుంచి పాదయాత్ర చేస్తూ మన ఊరు వచ్చారు. మీ నాన్నగారు పట్టుబట్టి మన ఇంటికి తీసుకువచ్చారు. దగ్గరగా వెళ్ళి దణ్ణం పెట్టు."

తల్లి మాటతో బితుకు బితుకుమంటూ స్వామి దగ్గరగా వెళ్ళి రెండు చేతులూ జోడించాడు వంశీ. స్వామి వంశీని దగ్గరగా తీసుకుని "చిరంజీవ" అంటూ దీవించాడు. వంశీకి ఒళ్ళు జలదరించినట్లయింది.

స్వామి కళ్ళు మూసుకున్నాడు. పెదాలు కదిలిస్తూ ఏవో మంత్రాలు చదువుకున్నాడు. రెండు చేతులూ ముందుకు చాచి గుప్పెట తెరిచాడు ఆశ్చర్యం ! ఒక చేతిలో తెల్లటి బూడిద, మరో చేతిలో ఎర్రటి కుంకుమ స్వామి చేతుల్లోకి వచ్చాయి.

"చిరంజీవికి ఈ విభూది ప్రతిరోజూ బొట్టు పెట్టండి. అలాగే ఈ కుంకుమ వెండి భరణిలో దాచుకుని సూర్యోదయం కాకముందే మీరు ధరించండి !"

స్వామి విభూది, కుంకుమ వంశీ తల్లి చేతులో పెట్టాడు. వంశీ స్వామిని కళ్ళు విప్పార్చుకుని చూడసాగాడు. అక్కడ వరండాలో కూర్చున్న వాళ్ళంతా "స్వామి శరణం, స్వామి శరణం" అంటూ వంగి వంగి దణ్ణాలు పెట్టారు.

"ఒరేయ్ వంశీ ! దేవుడెక్కడ దేవుడెక్కడ అంటూ పదేపదే అడుగుతుంటావు కదరా ! ఈయనే దేవుడు తెలిసిందా ?"

వంశీ తండ్రి కృష్ణమూర్తి స్వామిని చూపిస్తూ అన్నాడు. వంశీకి అర్థం కాలేదు. ఏదో అయోమయంగా అనిపించింది.

నిన్న పొద్దుట పటంలో బొమ్మను చూపిస్తూ ఈయనే దేవుడు అంది అమ్మ. నాన్న ఈ తాతను చూపిస్తూ దేవుడంటాడేమిటి ?

వంశీకి సందేహం వచ్చింది. అమ్మను అడుగుదామంటే అమ్మ చాలా హడావుడిగా ఉంది. నాన్నను ఎదురు ప్రశ్న వేస్తే తిడతాడు. కొడతాడు. ఒక చేతిలో విభూది, మరో చేతిలో కుంకుమ ఎలా వచ్చాయి ఈ స్వామికి ? నిజంగా ఈయన దేవుడేనేమో ?

వంశీ మనసులో అనుకున్నాడు. అయినా వంశీ ఆలోచనలు ఒక కొలిక్కి రాలేదు.

ఆ రాత్రి వంశీ ఇంట్లో భజన జరిగింది. ఎవరెవరో వచ్చారు. బోలెడు సందడి. అగరవత్తులు, అరటిపళ్ళు, కొబ్బరికాయలు, దీపాలు, ధూపాలు అందరూ పాటలు పాడారు. స్వామి కాళ్ళముందు పడి దణ్ణాలు పెట్టారు. వంశీ చాలాసేపు ఆ భజనలో కూర్చున్నాడు. తాళాలు వాయించాడు. మద్దెల శబ్దం విన్నాడు. 'దేవుడు స్వామి'ని తదేకంగా చూస్తూ ఆ భజనలోనే నిద్రకళ్ళతో కిందికి వాలిపోయాడు.

... ... ...

వంశీ ఉదయమే నిద్ర లేచాడు. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. వంట గదిలో అమ్మ కనిపించలేదు.

"అమ్మా ! అమ్మా !" అని గట్టిగా పిలిచాడు వంశీ. ఎవరూ పలకలేదు. వంశీ గొంతు విని పక్క ఇంట్లోంచి విజయా ఆంటీ వచ్చింది. "రా బాబూ లేచావా ?" అంటూ వంశీని ఎత్తుకుని తమ పోర్షనులోకి తీసుకెళ్ళింది.

విజయ ఆంటీ వంశీకి ముఖం కడిగి స్నానం చేయించింది, బట్టలు తొడిగింది, ఫలహారం పెట్టింది.

"ఆంటీ ! అమ్మా, నాన్నా ఏరీ ?" వంశీ అడిగాడు.

"బయటకు వెళ్ళారు బాబు. ఇప్పుడే వచ్చేస్తారు. నువ్వు చదువుకో !"

వంశీ చదువుకుంటూ కూర్చున్నాడు. కొంతసేపటికి స్కూలు టైమైంది. వంశీ తన పుస్తకాలు, పలక సంచీలో పెట్టుకుని ఆంటీతో చెప్పి స్కూలుకు బయలుదేరాడు. అంతలో వంశీ తండ్రీ, తల్లీ వచ్చారు. వంశీ తండ్రి కృష్ణమూర్తి దిగులుగా మంచంమీద పడుకుండిపోయాడు. తల్లి సావిత్రి కోపంతో గట్టిగా కేకలు పెడుతోంది. ఏడుస్తోంది.

తల్లి అవతారం, ఏడుపు, చూసి వంశీకి ఏడుపు వచ్చింది. ఏం జరిగిందో అర్థం కాలేదు. విజయ ఆంటీని భయం భయంగా అడిగాడు.

"నిన్న సాయంత్రం మీ ఇంటికొచ్చిన స్వామీజి రాత్రి ఇంట్లో బీరువాలోని బంగారం, డబ్బు అంతా ఎత్తుకుపోయాడట. మీ అమ్మా, నాన్నా పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి చెప్పి వచ్చారు. పోలీసులు ఆ దొంగ స్వామీజీని పట్టుకుంటారులే ! నువ్వు స్కూలు కెళ్ళిపోబాబు !"

విజయ ఆంటీ మాటలతో వంశీ బుర్ర తిరిగినట్లయింది. గుండె బేజారెత్తిపోయింది. గెడ్డం పెంచుకున్న ఆ తాతని 'దేవుడు' అన్నాడు నాన్న దేవుడు బంగారం ఎత్తుకుపోతాడా ! ఊహుం ఆ తాత దేవుడు కాదు. దేవుడు తప్పు చేయడు. తప్పు చేసిన వాళ్ళని దండిస్తాడు. అని మాస్టారు చెప్పారు.

మరైతే దేవుడు ఎవరు ? ఎక్కడుంటాడు ? ఆకాశంలో ఉంటాడా ? అమ్మ పూజ చేసే గదిలో ఉండే దేవుడే దేవుడా ? ఎవరు ? ఎవరు ?

ఏడుస్తున్న అమ్మ స్వరం వింటూ నీరసంగా స్కూలుకు బయలుదేరడు వంశీ. ఆలోచిస్తూ రోడ్డు వారగా నడుస్తున్నాడు. తనతోపాటు చాలా మంది పిల్లలు గబగబా ముందుకు వెళ్ళిపోతున్నారు.

వంశీ పక్కకు చూసి ఉలిక్కిపడ్డాడు. ఓ గుడ్డి ముసలమ్మ కర్ర పట్టుకుని రోడ్డుకు అడ్డంగా నడుస్తోంది. రోడ్డుమీద చిన్న గోతిలో కాలు వేసి దబుక్కున కింద పడిపోయింది.

దూరంగా ఒక వైపు నుంచి లారీ బర్రున శబ్దం చేస్తూ వస్తోంది. వంశీ పరుగెత్తుకుని ఆ ముసలమ్మ దగ్గరకు వెళ్ళి "లే మామ్మా ! లే" అన్నాడు.

ఆ మామ్మ చేయి పట్టుకుని లేవదీశాడు. కర్ర పట్టుకుని ఆ మామ్మను రోడ్డుకు అవతలగా నడిపించాడు.

అంతలో దూరం నుంచి లారీ హారను మోగిస్తూ అక్కడ ఆగింది. లారీలోంచి "ఒరేయ్ వంశీ !" అంటూ పిలుపు వినబడింది.

వంశీ తల పైకెత్తి చూశాడు. ఎదురుగా సుందరం బాబాయి. లారీలోంచి గెంతి వంశీ దగ్గరగా వచ్చాడు.

బాబాయిని గూడగానే వంశీ ముఖం ఆనందంతో వెలిగిపోయింది. సుందరం బాబాయి వంశీని ముద్దు పెట్టుకుంటూ ఎత్తుకున్నాడు.

"బాబాయ్ ! రాత్రి మనింట్లో గెడ్డం తాత బంగారం, డబ్బు ఎత్తుకుపోయాడంట." వంశీ ఆత్రంగా బాబాయికి విషయం చెప్పేశాడు.

'అలాగా బాబూ ! పద ఇంటికి వెళ్దాం. ఏం జరిగిందో తెలుసుకుందాం, ఈ పూటకి స్కూలు మానేద్దువుగానిలే.'

బాబాయి సుందరం వంశీని ఎత్తుకుని గబగబా ఇంటివైపు నడిచాడు.

"బాబాయ్, బాబాయ్ ! దేవుడు ఆకాశంలో ఉంటాడట కదా ! మనం పైకి వెళ్ళొచ్చా" వంశీ ఆత్రంగా అడిగాడు.

"ఆకాశంలోకి రాకెట్లమీదా, విమానాల్లోనూ వెళ్ళొచ్చు బాబూ. కాని అక్కడ దేవుడు ఉండడు.' బాబాయి నవ్వుతూ అన్నాడు.

"అదేమిటీ ? ఎందుకనీ ?"

"ఎందుకంటే దేవుడు భూమిమీదే ఉంటాడు కాబట్టి ?"

"ఈ భూమి మీద ఉంటాడా ? ఎక్కడ ?"

'దేవుడు ఈ భూమి మీదే ఉంటాడు బాబూ, ఆ దేవుడు మనుషుల్లోనే ఉంటాడు. మంచి పనులు చేసే మనుషులు అందరిలోనూ దేవుడు ఉంటాడు. మంచి మనుషులు అందరూ దేవుళ్ళే బాబూ, నువ్వు రోడ్డు మీద ముసలమ్మకు సాయం చేశావు కదా ! నువ్వూ దేవుడవే. నీలోనూ దేవుడు ఉన్నాడన్న మాట. నువ్వు చెడ్డపనులు చేశావనుకో నీలోంచి దేవుడు ఎక్కడికో వెళ్ళిపోతాడన్నమాట. తెలిసిందా?'

బాబాయి మాటలకు వంశీ తల ఊపాడు. వంశీ సందేహం తీరినట్లైంది. మనసులో ఏదో కొత్త దీపం వెలిగినట్లయింది. దేవుడు ఎక్కడ ఉంటాడో ఎలా ఉంటాడో తెలిసింది. మంచి పనులు చేసే మనుషులు అందరిలోనూ దేవుడు ఉంటే, తను ఎప్పుడూ దేవుడిలాగే ఉంటాడు. మంచి పనులే చేస్తాడు. బుద్ధిగా చదువుకుని పెద్దవాడై అందరికీ సాయం చేస్తాడు అంతే !

వంశీ గట్టిగా నిశ్చయించుకున్నాడు. వంశీ మనసిప్పుడు స్వచ్ఛంగా ఉంది. ప్రశాంతంగా ఉంది. మహానిర్మలంగా ఉంది...

"వంశీ ! నువ్వు రేపటి పౌరుడివి. దేవుడు ఒక మాయ అని, మరో లోకంలో ఉంటాడని, లేక కొండమీదా, గుళ్ళలోనూ కాపురం ఉంటాడని చెప్పడం నాకు ఇష్టం లేదు. ఇప్పటి నుంచి నీలో మంచితనానికి, మానవత్వానికి బీజాలు వేయాలి. ఈ వయసులో నీకు దేవుడు ఎవరు ? ఎక్కడ ఉంటాడు అన్న సందేహాలు వచ్చాయి, కాబట్టి నీకు నువ్వే దేవుడివని- నీలోనే దేవుడున్నాడని నీకు తెలియాలి. అందుకే అలా చెప్పాను." సుందరం సుందరంగా తనలో తాను సణుక్కున్నాడు.

ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక
30-8-1989